శృంగారం పరాకాష్ఠ నందుకుంటూ ఉండగా-
ఊహాతీతంగా-

అతను హఠాత్తుగా చేతులు ముందుకు చాచి, ఆ అమ్మాయి మెడ చుట్టూ బిగించాడు.

రతి పారవశ్యంలో ఉన్న ఆ అమ్మాయి వెంటనే అది గమనించలేదు.

గమనించేసరికి చాలా ఆలస్యమైపోయింది. మెడచుట్టూ అతని చేతులు గట్టిగా, మరింత గట్టిగా బిగుసుకుపోతున్నాయి.

కెమెరా క్లోజప్‌లోకి వచ్చింది.

అది నటన కాదు ! నిజం !

రెండు రకాల అనుభవాల తాలూకు ఛాయలూ ఒకేసారి ఆమె కళ్ళలో కనబడుతున్నాయి.

ఓవైపు స్వర్గసుఖం !

మరోవైపు ఘోర నరకం !

ఆ రెండు ఎక్స్‌ట్రీమ్ ఎక్స్‌పీరియెన్సెన్స్ మధ్యలో కొట్టుకులాడిపోతూ, కొద్ది నిమిషాల తరువాత నిశ్చలంగా అయిపోయింది ఆ అమ్మాయి శరీరం.

అది చూస్తున్న ఉజ్వలకి సౌమ్య గుర్తొచింది.

“దట్ సెల్ఫ్ రైటీయస్ బ్లడీ బిచ్ అనుకుంది అసూయగా. నీతి నియమం అన్నీ తన కొక్కదానికే అన్నట్లు చూసే దాని పోజూ, అదీ...”

హఠాత్తుగా స్ఫురించింది ఆమెకి. తను సౌమ్యకి ఇలాంటి పనిష్‌మెంట్ ఇవ్వగలిగితే ! ఈ సిన్మాలో అమ్మాయికి అతను ఇచ్చినట్లు !

అదే సమయంలో గురుదత్ అన్నాడు-

“నువ్వు చెప్పినట్లే చెయ్యడానికి ప్రయత్నిస్తాను ఉజ్వలా !”

“ఏమిటి?”

“అదే ! నువ్వు మా కుటుంబంలో చేరిపోవడం”

అతని గొంతు కోరికతో కొత్త రకంగా వినబడుతోంది. గురుదత్‌కి కూడా అతని భార్య గుర్తు వచ్చింది.

హిప్పో పొటామస్ లాంటి షేప్‌లెస్ లైఫ్ !

అతనికీ అలాంటి ఆలోచనే వచ్చింది.

ఆమెని ఈ సినిమాలో పిల్లని చంపినట్లు చంపేస్తే...

సాలోచనగా నెమ్మదిగా ఉజ్వల చుట్టూ చేతులు వేశాడు అతను.

మనీ మేక్స్ మెనీ థింగ్స్ !

నో డవుట్ !

బట్ సెక్స్ కెన్ మేక్ మెనీ మోర్ థింగ్స్ ! యా యా !

[సశేషం]

## అమెరికా భీముడు

జగత్ప్రసిద్ధి చెందిన కోడి రామమూర్తి గారు రైలును పట్టి ఉంచి కదలకుండా చేసేవారట. అందుకే ఆయన్ని ‘అపర భీముడు’ అనేవారు. ఈ కోవకి చెందిన వాడే అమెరికాకి చెందిన పీటర్ జెఫర్‌సన్ అనే బలశాలి. ఉక్కు దిమ్మలు ఈయన కాళ్ళకి పూచిక పుల్లల్లా అనిపించేవట. ఈ ఘనుడు ఒక్కొక్కటి వెయ్యేసి పౌన్ల బరువున్న రెండు పీపాలను అవలీలగా పిల్లి పిల్లల్ని ఎత్తినట్లు చెరో చేత్తో ఎత్తేసి బంతి విసిరినట్లు దూరంగా విసిరేసేవాడట.

- కె.ఆర్.కె.మోహన్

# పరిశ్రమ

## -శివల జగన్నాథరావు

ఆ సోమవారం నుంచీ తనేం చేయాలో బొత్తిగా తోచలేదు గురుమూర్తికి. శనివారం తను సర్వీసు నుంచీ రిటైరయ్యాడు. ఆఫీసు వాళ్ళు ఒక పార్టీ ఇచ్చారు - చేతి కర్ర, కొత్త గొడుగు ప్రెజెంట్ చేశారు. శనివారం, ఆదివారం రెండ్రోజులూ చక్కగా, సుఖంగా, తెరిపిగానే గడిచాయి. టి. వి. ఇష్టం వచ్చినంతసేపు వేసుకుని చూశాడు. కొడుకు వాళ్ళ స్టాఫ్ క్లబ్ నుంచీ తీసుకు వచ్చిన పత్రికలన్నీ కళ్ళద్దాలు సవరించుకుని మరీ ఓపిగ్గా చదివాడు. భార్య లక్ష్మీదేవితో వంట గది గడప మీద కూర్చుని కబుర్లు చెప్పాడు. రెండ్రోజులూ ఎనిమిదిమార్లయినా కాఫీ తాగాడు.

ఇంట్లో తనూ, భార్యా, కొడుకు శత్రుఘ్న కోడలు ద్రౌపది - నలుగురే మెంబర్లు. శత్రుఘ్న స్టేట్ గవర్నమెంటులో క్లర్క్. పర్మినెంట్ ఉద్యోగం. వాడికి పెళ్ళయ్యి రెండేళ్ళవుతున్నది. ఇంకా మనవలు రాలేదు ఇంట్లోకి.

మూడో రోజు నుంచీ ఇబ్బందులు ప్రారంభం అయినాయి. అలవాటు కొద్దీ అయిదో గంటకే లేచిపోతే భార్య గొణిగింది- “తమరేం చేయాలి ఇంత వేగిరం లేచి? అయినాయి గదా ఉద్యోగం రోజులన్నీను?” అంటూ. మూలిగి పడుకుని ఆరు గంటలకు లేచాడు. రెండోమారు కాఫీ అడిగితే లేదని చెప్పింది లక్ష్మీదేవి. “మీ ఆదాయం ఆగిపోయింది మరిచిపోయారా? అందుకని ఖర్చులు తగ్గించాలి మనం” అన్నది. ప్రాణం ఉసూరుమన్నది.

కొడుక్కి ఉదయం తొమ్మిది గంటలకే వేడి వేడిగా భార్యా, కోడలూ ఇద్దరూ అన్నం కొసరి కొసరి తినిపిస్తుంటే కొన కళ్ళతో గురుమూర్తి దూరంగా నిలబడి చూశాడు. అతనిని పదిన్నర గంటలకు భోజనానికి పిలిస్తే మూలుక్కుంటూ వెళ్ళాడు. కాలక్షేపం కావడం చాలా కష్టం అయిందతనికి. అవాళ టి. వి. ఆన్ చేస్తే ఏ కార్యక్రమం రాలేదు. రేడియోలో పాటలవీ ఎంతకని ఆలకిస్తాడు? పుస్తకాలు మాత్రం ఎంతకని చదువుతాడని?

పడక్కుర్చీలో కూర్చుని కూర్చునీ నడ్డి నెప్పి పుడితే మంచం మీద వాలేదు. రోజూ మధ్యాహ్నం పడుకునే అలవాటు లేకపోవడం వలన నిద్ర రావడం లేదు. మనసెందుకో మూగబోయినట్టయింది. డల్‌గా, బోరుగా అనిపించసాగింది. ఇల్లంతా నిశ్శబ్దం నిండి అది తనని వెక్కిరిస్తున్నట్టూ, కబళిస్తానన్నట్లూ అనిపించసాగింది.

ఏదో దిగాలుగా, నిరుత్సాహంగా ఉందతనికి. భార్యా, కోడలూ రెండ్రోజులు బాగానే మాట్లాడారు తనతో. మూడో నాటి నుంచీ వాళ్ళ పనుల్లో వాళ్ళుండీ గురుమూర్తిని పట్టించుకోవడం లేదు. లక్ష్మీదేవి భోజనం చేసి మూడు గంటలదాకా పడుకున్నది. ద్రౌపదేమో వాళ్ళ గదిలోకి పోయి తలుపులేసుకుని ఏదో పుస్తకం చదువుకోసాగింది. గురుమూర్తికి టైము పాసవడం చాలా కష్టంగా ఉంది. పడుకోనీ, కూర్చునీ, పచారు చేసీ అసహనంగా, అనీజీగా గడిపాడు.

రాత్రికి ఒంట్లో నలతగా అనిపించింది. ఒళ్ళు వేడిగా ఉందేమో, జ్వరం వచ్చిందేమో చూడమన్నాడు భార్యని. ఆవిడ చెయ్యి వేసి చూసి - “అబ్బే! అంతా మీ అనుమానం” అన్నది.

గురుమూర్తికి విచారంగా, నీరసంగా అనిపిస్తోంది.

మంగళవారం, బుధవారం అలాగే అస్వస్థతతో తీసుకున్నట్టే దిగాలుగా గడిపాడు. డాక్టర్ని పిలవమని చెప్పాడు కొడుక్కి. డాక్టరు వచ్చి చూసి నవ్వేశాడు. “అంతా మీ భ్రమ! రెస్టు తీసుకోండి. ఇంకంతా రెస్టే గదా?” అనేసి వెళ్ళిపోయాడు.

ఒళ్ళు మండింది గురుమూర్తికి. అదేంటో! మాటిమాటికీ కోపం వస్తున్నది.

కొడుకు తీసుకు వచ్చిన పుస్తకాలలో ఒక్క కథ కూడా చదవాలనీ అనిపించలేదతనికి. ఒక్క పేజీ కూడా ఆసక్తితో చూడలేకపోయాడు.

టీ. వీ. రాత్రి వేస్తే ఏ కార్యక్రమం కూడా ఇష్టంతో, ఇంట్రెస్టుతో చూడలేకపోయాడు. విసుగ్గా ఉంటోంది. చిరాకుగా అనిపిస్తున్న దేమిటి? డాక్టరేమో ఒంట్లో బాగానే వున్నదంటాడేమిటి? ఎందు కీ మార్పు తనలో?

** ** ** **

స్నేహితుడూ, తనతోనే సమంగా రిటైరైన విశ్వంతో తన గోడంతా చెప్పుకున్నాడు గురుమూర్తి. విశ్వం నవ్వాడదోలా.

“అంతా నీ అనుమానం వోయ్! మూర్తీ!” అన్నా డతను.

“చస్! నువ్వూ అట్లా అనకు. ఒళ్ళు మండుతుంది నాకు!”

“ఓహ్! అయితే ఇదంతా ఆ లక్షణం అన్నమాట!”

“ఏ లక్షణం?”

విశ్వం తనింటికి స్నేహితుడిని తీసుకు వెళ్ళాడు. “మేస్టారూ నమస్తే” అన్నారు అయిదుగురు చిన్న పిల్లలు. గురుమూర్తి ఆశ్చర్యంతో “ఇదెప్పట్నించీ?” అడిగాడు.

“నిన్నటి నుంచే మొదలు పెట్టానోయ్!” ఊసుపోలేదంటే మా అబ్బాయి వీళ్ళని తెచ్చి అప్పగించాడు. రెండు పూటలా ట్యూషను చెబుతూంటే నాకు ఎంతో రిలీఫ్‌గా ఉంటోంది. పని ఏదైనా చేస్తూంటేనే మనిషికి సంతోషంగా ఉంటుందనుకో. ఏ పనీ లేకపోతే ఆనందం, కులాసా ఉండవు!” అన్నాడు. పరిశ్రమే వరమ ఆరోగ్యం అనుకున్నాడు గురుమూర్తి.

ఆ వారంలోనే గురుమూర్తి ఒక ప్రయివేటు ఉద్యోగానికి కుదురుకున్నాడు తన పలుకుబడితో.

ఇప్పుడతనికి కాలం దుర్భరంగా లేదు. మునుపట్లాగే ఇంట్లో జోకులేస్తూ అందరితో ఉషారుగా ఉంటున్నాడు. ★

“నే నివాళ మధ్యాహ్నం ఊర్వశి హొటల్లో పిండి రుబ్బానని నీ కెలా తెల్సు?” అడిగాడు గిరిబాబు. “నీ ప్రక్కన మునుగేసుకుని అంట్లు తోమింది నేనేలే” చిన్నగా చెప్పాడు రామదాసు.

పద్మశ్రీ